

చిలుకూరు బాలాజీ దేవాలయంలో ఏఐసీటీఈ చైర్మన్ సీతారాం

ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మికత వైపు నడవాలి

ఏఐసీటీఈ చైర్మన్ సీతారాం

చిలుకూరు బాలాజీకి ప్రత్యేక పూజలు

మొయినాబాద్, ఆగస్టు 3: ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మికత వైపు నడవాలని ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యూకేషనల్ (ఏఐసీటీఈ) చైర్మన్ సీతారాం అన్నారు. మొయినాబాద్‌లోని చిలుకూరు బాలాజీ వేంకటేశ్వరస్వామిని శనివారం ఆయన దర్శించుకున్నారు. ప్రముఖక్షేత్రమైన చిలుకూరు బాలాజీ దేవాలయానికి శనివారం సాయంత్రం వచ్చిన సీతారాంకు ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ స్వాగతం పలికి స్వామివారి దర్శనాన్ని కల్పించారు. అనంతర తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు. ఆలయ విశిష్టతకు సంబంధించిన వివరాలను సీతారాం రంగరాజన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత వైపు నడవాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట కుండే గణేష్, ప్రొఫెసర్ భాస్కర్, శ్రీకాంత్, పవన్, తదితరులున్నారు.



అక్రమార్కులు కూల్చిన హెచ్ఎండీఏ భూముల షెడ్లు

రూ.500 కోట్ల విలువైన హెచ్ఎండీఏ భూముల

కబ్జాకు యత్నం

- ఐదుగురిపై కేసు.. మూడు జేసీబీలు స్వాధీనం
- ముగ్గురి రిమాండ్.. పరారీలో ఇద్దరు
- 50 ఎకరాలు మాయం చేసేందుకు నిందితుల యత్నం
- ఆర్నెల్ల క్రితమే ఇవి హెచ్ఎండీఏ భూములని తేల్చిన సుప్రీంకోర్టు

ఒకటి కాదు.. రెండు కాదు.. దాదాపు దాని విలువ రూ.500 కోట్లు. అది కూడా హెచ్ఎండీఏ భూమి. దానిని కాజేస్తే అడిగేవారు ఎవరూ లేరనుకున్నారేమో. వెంటనే రంగంలోకి దిగి కబ్జా చేసే ప్రయత్నం చేశారు హైదరాబాద్‌కు చెందిన కొందరు కబ్జాదారులు. శంషాబాద్‌లో ఉన్న విలువైన ఆ భూమిలో పాగా వేసేందుకు పన్నాగం పన్నారు. ఆ భూములను చదును చేసేందుకు వెంటనే జేసీబీలను తీసుకువచ్చారు. అక్కడ భూమిని చదును చేయడానికి ప్రయత్నం చేస్తుండగా విషయం తెలుసుకున్న హెచ్ఎండీఏ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి ఐదుగురిపై కేసు నమోదు చేసుకొని మూడు ఎక్స్‌కవేటర్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ముగ్గురిని రిమాండ్‌కి తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. - శంషాబాద్ రూరల్, ఆగస్టు 3 :

- వివరాలు 7వ పేజీలో



"ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి కాసుల సురేష్ గౌడ్, మొయినాబాద్ మండలం, హిమాయత్‌నగర్ గ్రామం. ఆరేళ్ల క్రితం ఈ యువకుడు పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు కవల పిల్లలు. సురేష్‌గౌడ్ పెళ్లికి ముందు.. అతని పేరు తల్లిదండ్రుల రేషన్ కార్డులో ఉండేది. కుటుంబం వేరు కావడంతో రేషన్ కార్డు సెపరేట్ చేసుకోవాలనుకున్నాడు. కొత్త రేషన్ కార్డుకోసం మీసేవలో దరఖాస్తు చేసుకున్నాడు. తల్లి దండ్రుల రేషన్ కార్డులో నుంచి సురేష్‌గౌడ్ పేరును తొలగించారు. కానీ, కొత్త రేషన్‌కార్డు మాత్రం రాలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కొత్తరేషన్ కార్డులు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం పట్ల అతడు సంతోషంగా ఉన్నాడు. తనకు రేషన్‌కార్డు వస్తే ప్రభుత్వ పథకాలకు అర్హత కలుగుతుందని భావిస్తున్నాడు."



రేషన్ కార్డు మంజూరు చేయాలి



రేషన్ కార్డు మంజూరు చేయాలి. గత ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డాం. ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలంటే రేషన్ కార్డు అడుగుతున్నారు. దాంతో ఇబ్బందులు తప్పడం లేదు. మాకు పెళ్లయి కుమారుడు పుట్టి, పెరిగి పెద్దవుతున్నా.. నేటికీ రేషన్ కార్డు జారీ కాలేదు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా లాభం లేకుండా పోయింది.

- ఈర్లపల్లి మహేష్, లక్ష్మారావుగూడ

చాలాసార్లు దరఖాస్తు చేసుకున్నా



రేషన్ కార్డు కోసం ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నా. నాకు ఇద్దరు పిల్లలు. రేషన్ కార్డు లేకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. 9 ఏళ్ల నుంచి కార్డు కోసం ఎదురు చూస్తున్నా. బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డు మంజూరు చేయలేదు. సీఎం కేబినెట్‌లో రేషన్ కార్డుల మంజూరు కోసం తీసుకున్న నిర్ణయం సంతోషం. నాలాంటి ఎంతో మంది రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్నారు.

- శ్రీశైలం, లక్ష్మారావుగూడ

దరఖాస్తుల వివరాలు

	మొత్తం దరఖాస్తులు	ఇన్‌స్పెక్టర్ లాగిన్‌లో పెండింగ్	తహసీల్దారు లాగిన్‌లో	డీఎస్‌వో ఆమోదం	డీఎస్‌వో నిరాకరణ
మార్పులు, చేర్పులు	8,398	3,589	979	3,301	529
కొత్త రేషన్ కార్డులు	71,226	-	-	46,430	24,796

చిగురిస్తున్న ఆశలు!

- ఇప్పటికే 46,430 కార్డులకు డీఎస్‌వో ఆమోదం
- త్వరలోనే మంజూరు కానున్న కార్డులు
- ఆశగా ఎదురుచూస్తున్న పేదలు

జిల్లాలో వందలాది మంది పదేళ్లుగా కొత్త రేషన్ కార్డుల కు నోచుకోలేదు. ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రవేశపెట్టినా రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకోవడంతో వేలాది మంది ఈ పథకాలకు అర్హత సాధించడం లేదు. దీంతో అనేకమంది పేదలు సర్కారు సాయానికి దూరమవుతున్నారు. అయితే, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. దీనికి కేబినెట్ కూడా ఆమోదం తెలపడంతో రేషన్ కార్డుల కోసం ఎదురు చేస్తున్న వారిలో ఆశలు రేకెత్తుతున్నాయి.

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 3: కొత్త రేషన్ కార్డుల జారీ కోసం రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రేషన్ కార్డుతో పాటు కొత్తగా ఆరోగ్యశ్రీ కార్డులను జారీ చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దాంతో జిల్లా ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కొన్నేళ్లుగా వివాహాలు చేసుకున్న, ఉమ్మడి కుటుంబం నుంచి వేరైన వారికి రేషన్ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందటం లేదు. అలాగే పిల్లల చదువులు, ఇతర విషయాల్లో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో మార్పులు, చేర్పుల కోసం 8,398 మంది దరఖాస్తు చేసుకోగా.. కొత్త రేషన్ కార్డు కోసం 71,226 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇప్పటికే 46,430 కార్డులు డీఎస్‌వో ఆమోదించారు. రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో కార్డులు మంజూరు కానున్నాయి.

ప్రభుత్వ సబ్సిడీలు పొందలేక..

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 జూలైలో కొన్ని కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసింది. ఆ తర్వాత కార్డుల ఊసే లేదు. ఉమ్మడి కుటుంబాల నుంచి విడిపోయిన వారు, పెళ్లిళ్లు అయిన వారు కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. కాగా, ఇప్పటివరకు వారికి ఒకే రేషన్ కార్డు ఉండటం.. అందులో భర్త పేరు ఒక కార్డులో, భార్య పేరు మరొక కార్డులో.. పిల్లల పేర్లు ఏ కార్డులో లేక ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు 'కరోనా' తర్వాత సొంత గ్రామాలకు తిరిగి వచ్చారు. వారికి రేషన్ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం అందించే సబ్సిడీ గ్యాస్, ఉచిత విద్యుత్‌తో పాటు రైతు రుణమాఫీలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని పలు కుటుంబాలు అన్ని అర్హతలున్నా.. రేషన్ కార్డులు లేకపోవడంతో సర్కార్ సాయం అందక నానా అవస్థలు పడుతున్నారు. రేషన్ దుకాణాల్లో నిత్యావసరాలు పొందలేకపోతున్నారు. వివిధ ప్రభుత్వ పనులకు కూడా రేషన్, ఆధార్‌కార్డులను కొలమానంగా పరిగణిస్తుండడంతో కార్డులు లేని కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి.

పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికం!

పేదలకు చౌక ధరలకే సరుకులు అందించాలన్న లక్ష్యంతో ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రభుత్వం తీసుకు వచ్చింది. దాంతో రేషన్ కార్డు దారులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఇప్పుడు ఇదే నిబంధన అన్ని పథకాలకు ప్రామాణికంగా మారింది. ప్రజా పంపిణీ బియ్యం అందాలన్నా.. పింఛను కావాలన్నా.. రుణమాఫీ జరగాలన్నా రేషన్ కార్డు ఉండాల్సిందే. ప్రభుత్వం అమలు చేసే అనేక పథకాలకు రేషన్ కార్డుదారులే అర్హులు.

కొత్త రేషన్‌కార్డుల జారీపై రాష్ట్ర కేబినెట్‌లో నిర్ణయం

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి నిరీక్షణ..

గతంలో రేషన్ కార్డుల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నవారు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. అలాగే కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం గతేడాది డిసెంబరు 28 నుంచి జనవరి 6వరకు నిర్వహించిన ప్రజా పాలనలో తమకు కార్డులు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. వీరికి నిరీక్షణ తప్పడం లేదు.

జిల్లాలో 5,58,410 రేషన్ కార్డులు

జిల్లాలో 936 రేషన్‌షాపులు ఉన్నాయి. పట్టణ ప్రాంతంలో 218, గ్రామీణ ప్రాంతంలో 718 ఉన్నాయి. మొత్తం రేషన్‌కార్డులు 5,58,410 ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతంలో 3,50,123, పట్టణ ప్రాంతంలో 2,08,287 ఉన్నాయి. 18,22532 యూనిట్లు, బియ్యం 11559.197 మెట్రిక్ టన్నులు కేటాయిస్తున్నారు.

ఇక నుంచి నిరంతర ప్రక్రియ

పదేళ్లుగా కొత్త ఆహారభద్రత (రేషన్) కార్డుల మంజూరు ఊసే లేకుండా పోయింది. ఏటా కుటుంబాల సంఖ్య పెరుగుతున్నా. ఆ మేరకు కార్డుల సంఖ్య పెరుగుతున్నా.. మంజూరు ఊసు మాత్రం లేదు. పదేళ్లుగా మీసేవ సెంటర్ల ద్వారా దరఖాస్తులు కూడా తీసుకోకపోవడంతో పథకాల ప్రయోజనాలకు ప్రతిబంధకంగా మారింది. సీఎం ప్రకటనతో మళ్లీ కొత్త రేషన్‌కార్డుల జారీకి మోక్షం లభించనుంది. గతంలో లాగా కాకుండా నిరంతర ప్రక్రియగా రేషన్‌కార్డులు జారీ చేస్తామని చెప్పడంతో లబ్ధిదారులకు ఊరట లభించింది. కొత్తగా పెళ్లిళ్లు చేసుకున్న వారికి, ఇప్పటికే ఏళ్లు గడుస్తున్న వారికి రేషన్‌కార్డులు మంజూరు చేయాలని, కార్డుల్లో పేర్ల నమోదు, తొలగింపు నిరంతర ప్రక్రియగా ఉండాలని పలువురు కోరుతున్నారు.


కొత్తగా పేర్ల నమోదుకు సమగ్ర విచారణ

గతంలో కార్డులను రద్దు చేయడానికి, కొన్ని కార్డులలో నుంచి కుటుంబ సభ్యుల పేర్లు తొలగించడానికి అనేక కారణాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు పొందడం, కుటుంబం నుంచి వేరు పడడం, ఒక కార్డు నుంచి మరో కార్డులో చేరిక, వలసలు వెళ్లడం, చనిపోవడం, రెండు కార్డుల్లో పేర్లు ఉండడం, ఇతర కారణాలతో రేషన్‌కార్డులో పేర్లు తొలగించారు. ప్రస్తుతం అర్హుల పేర్లు చేర్చడంతో పాటు కొత్త కార్డు పొందడానికి అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే, గత ప్రభుత్వ హయాంలో పాత రేషన్‌కార్డులో తప్పొప్పుల సవరణల వల్ల దాదాపుగా నాలుగేళ్లుగా సేవలు నిలిచిపోయాయి.

పేర్లు చేర్చక పోవడంతో ఇబ్బందులు

గతంలో రేషన్ షాపు ద్వారా బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులను అందించే వారు. ఇప్పుడు బియ్యంతోనే సరిపెడుతున్నారు. కొత్త ప్రభుత్వంలో గతంలో మాదిరిగా నిత్యావసర సరుకులను రేషన్ కార్డుదారులకు అందించేందుకు కసరత్తు చేస్తుండటం ఊరటనిచ్చే అంశం. కార్డుల్లో కొత్తగా పేర్లను చేర్చకపోవడంతో కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగినా కార్డుల్లో పేరు లేకపోవడంతో పాత కోటానే అందిస్తున్నారు. దీంతో పేదలు బయట మార్కెట్‌లో అధిక ధరలకు బియ్యం కొనుగోలు చేయాల్సి వస్తోంది. నిత్యం కూలి పనులకు వెళ్తేనే కుటుంబం గడిచే వారికి ఇది భారంగా మారుతోంది. కొత్త కార్డులతో పాటు నూతనంగా సభ్యులను చేర్చాలని కోరుతున్నారు.





ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియను

వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 3 : ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. ఖమ్మం జిల్లా నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జయశంకర్ భూపాలపల్లి నుంచి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. బడంగ్‌పేట్, తుర్కయంజాల్, పెద్ద అంబర్‌పేట్, షాద్‌నగర్‌లో ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లు ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్నవి మున్సిపల్ కమిషనర్లకు, మున్సిపల్ పరిధిలో లేనివి జిల్లా కలెక్టర్ పరిధిలోకి వస్తాయన్నారు. ఎల్ఆర్ఎస్‌లో ప్లాట్ క్రమబద్ధీకరణకు మూడు స్థాయిల్లో పరిశీలనలు చేయాలన్నారు. లేఅవుట్ క్రమబద్ధీకరణకు నాలుగు అంచెలు ఉంటాయన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో కూడిన మల్టీ డిసిప్లినరీ బృందాలను ఏర్పాటు చేయాలని, క్రమబద్ధీకరణ దరఖాస్తులపై జారీ చేసిన నోటీసులకు సంబంధించిన సమస్యలను నివృత్తి చేసేందుకు స్థానిక సంస్థల కార్యాలయాల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. లేఅవుట్‌లకు సంబంధించిన దరఖాస్తులను జిల్లాల్లోని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), హెచ్ఎండీఏ పరిధిలో ప్లాన్ చేస్తున్న సిటీ ప్లానర్లు డైరెక్టర్లు, గ్రామ పంచాయతీల అదనపు కలెక్టర్లు (ఎల్‌బీ) కేసులను ధ్రువీకరిస్తారన్నారు. లే అవుట్‌లకు తుది ఆమోదం విషయంలో హెచ్ఎండీఏకు మెట్రోపాలిటన్ కమిషనర్, జీహెచ్ఎంసీ ఏరియాకు జీహెచ్ఎంసీ కమిషనర్, మిగిలిన ప్రాంతాలకు కలెక్టర్ తెలుపుతారన్నారు. సమావేశంలో డీపీవో సురేష్‌మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శశాంక

ధరణి దరఖాస్తులను వారంలోగా పరిష్కరిస్తాం

ధరణి దరఖాస్తులను వారంలోగా పరిష్కరిస్తామని కలెక్టర్ శశాంక తెలిపారు. ధరణి పెండింగ్ దరఖాస్తులపై సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. జూన్ 30 వరకు వచ్చిన దరఖాస్తులను వారంలోగా పరిష్కరిస్తామని తెలిపారు. ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో లేకుండా వారం లోపు అన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. అలాగే మ్యుటేషన్, కోర్టు కేసులకు సంబంధించిన దరఖాస్తులను కూడా పెండింగ్‌లో లేకుండా చూస్తామని తెలిపారు. అనంతరం ఆయన ఆర్డీవోలు, తహసీల్దార్లతో మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఆర్డీవోలు సూరజ్‌కుమార్, అనంతరెడ్డి, సాయిరాం, వెంకట్‌రెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు. అనంతరం జరిగిన మహిళా శిశు సంక్షేమాధికారి, సీడీపీవోల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక వసతులను త్వరితగతిన ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలలో తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణాలకు కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

తల్లిపాలు అమృతం : జయమ్మ



నర్సాయపల్లిలో తల్లిపాల వారోత్సవంలో పాల్గొన్న సూపర్‌వైజర్ జయమ్మ

మాడ్గుల, ఆగస్టు 3 : తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటిదని మాడ్గుల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ తెలిపారు. మాడ్గుల, నర్సాయపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమైనవని, రోగనిరోధక శక్తి పెంపునకు, సంపూర్ణ ఆరోగ్యం, బిడ్డ ఎదుగుదలకు దోహదపడుతాయన్నారు. బిడ్డపుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని, పిల్లలకు గుండె సంబంధిత జబ్బులు, క్యాన్సర్, శ్వాసకోశ వంటి వ్యాధులు రాకుండా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో టీచర్ అనిత, తల్లులు పాల్గొన్నారు.



బీకేఎస్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కోశాధికారి మాణిక్యరెడ్డి

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

పరిగి, ఆగస్టు 3: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులూ లేకుండా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ కోశాధికారి మాణిక్యరెడ్డి, జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, పరిగి మండల అధ్యక్షుడు బి.వెంకట్‌రెడ్డిలు అన్నారు. శనివారం పరిగిలోని పాలకేంద్రంలో మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బీకేఎస్ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ అనేక మంది రైతులకు రుణమాఫీ జాబితాల్లో పేర్లు రాక ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రతి రైతుకూ ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని కోరారు. తిరిగి కొత్త రుణాలు ఇవ్వడంలో బ్యాంకర్లు రైతులను ఇబ్బందులకు గురిచేయద్దని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు సుబ్బారెడ్డి, దామోదర్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై బురదలో వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

రోడ్డు బాగు చేయాలని నిరసన

పరిగి, ఆగస్టు 3: పరిగి మునిసిపల్ పరిధిలోని బాలాజీనగర్‌లో రోడ్లు అధ్వానంగా మారినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు శనివారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపై నిలిచిన బురదలో కాలనీవాసులు వరినాట్లు వేసి, మునిసిపల్ అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వర్షపునీరు నిలిచి అడుగు ముందుకు వేయని విధంగా రోడ్డు మారినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సొంత డబ్బుతో మట్టిని వేయించుకున్నామని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లను బాగు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రద్దీగా మారిన హైదరాబాద్- శ్రీశైలం హైవే


బారులు తీరిన వాహనాలు

ఆమనగల్లు, ఆగస్టు 3: హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి రద్దీగా మారింది. శ్రీశైలం డ్యామ్ పది గేట్లను ఎత్తడంతో సందర్శకుల తాకిడి భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో శనివారం రహదారిపై వాహనాలు బారులు తీరాయి. కడ్తాల మండలం మైసిగండి టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీ కన్పించింది. శని, ఆదివారాలు సెలవు కావడంతో వందల సంఖ్యలో కార్లు దర్శనమిచ్చాయి. తుక్కుగూడ, కందుకూరు, కడ్తాల, ఆమనగల్లు మీదుగా పెద్దఎత్తున వాహనాలు శ్రీశైలం వెళ్తుండడంతో హోటళ్లకు గిరాకీ పెరిగింది. మరో వారం రోజులపాటు రద్దీ ఉండే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ప్రమాదాలకు చోటు లేకుండా పోలీసులు, ట్రాఫిక్ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

సర్దార్‌నగర్‌లో కంది - షాద్‌నగర్ రోడ్డుపై ధర్నా


రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు, వ్యాపారులు

షాబాద్, ఆగస్టు 3: విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సర్దార్‌నగర్ రోడ్డుపై శనివారం రైతులు, వ్యాపారులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సర్దార్‌నగర్, కుర్వగూడ, కక్కులూర్ గ్రామాల రైతులు, వ్యాపారస్తులు మాట్లాడుతూ... విద్యుత్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహించారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతూ వ్యవసాయానికి ఇబ్బందిగా మారిందన్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు విష్ణు, సురేష్, నరేష్, సురేందర్‌రెడ్డి, పాండు, ప్రవీణ్, రాజుగౌడ్, నర్సింహులుగౌడ్, కృష్ణయ్య ఉన్నారు.

రూ.500 కోట్ల విలువైన హెచ్‌ఎండీఏ భూముల కబ్జాకు యత్నం

- ఐదుగురిపై కేసు.. మూడు ఎక్స్‌కవేటర్ల స్వాధీనం
- ముగ్గురి రిమాండ్.. పరారీలో ఇద్దరు
- 50 ఎకరాలు మాయం చేసేందుకు నిందితుల యత్నం
- ఆరు నెలల క్రితమే హెచ్‌ఎండీఏ భూములని తేల్చిన సుప్రీంకోర్టు

శంషాబాద్‌రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దాదాపు రూ.500 కోట్ల విలువైన 50 ఎకరాల హెచ్‌ఎండీఏ భూములను కబ్జా చేయడానికి యత్నించిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసిన సంఘటన శనివారం రంగారెడ్డి జిల్లా ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మున్సిపల్ కేంద్రం లోని సర్వే నెంబర్ 725లో 181 ఎకరాల హెచ్‌ఎండీఏ భూములున్నాయి. అయితే, నగరానికి చెందిన మహ్మద్ ఖలీద్, మహ్మద్ షాబాజ్ మూడు ఎక్స్‌కవేటర్లతో శనివారం హెచ్‌ఎండీఏ భూములను చదును చేయడానికి యత్నించగా.. విషయం తెలుసుకున్న హెచ్‌ఎండీఏ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మూడు ఎక్స్‌కవేటర్లను సీజ్ చేసి, డ్రైవర్లు రషీద్, నందు, నిసార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కబ్జాకు యత్నించిన ఖలీద్, షాబాజ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరు నెలల క్రితం సుప్రీంకోర్టు అవి హెచ్‌ఎండీఏ భూములని తీర్పు చెప్పినా కూడా అక్రమార్కులు మాత్రం.. మా దగ్గర డాక్యుమెంట్లు ఉన్నాయని, మరో సారి ఆక్రమించడానికి యత్నించారు. దాంతో మరో సారి వివాదాస్పదమైంది. గతంలో నకిలీ ఇంటి పన్ను, రశీదులు సృష్టించి, నకిలీ డాక్యుమెంట్లతో కోర్టుకు వెళ్లిన సదరు వ్యక్తులు.. బోగస్ ఉత్తర్వులను తీసుకుని విలువైన భూములను కాజేయాలని చూశారు. అయితే, బీఆర్ఎస్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో భారీ భూబాగోతాన్ని తెలంగాణ ప్రభుత్వం చాకచక్యంగా తిప్పికొట్టింది. కోర్టు బోగస్ ఉత్తర్వులు, తప్పుడు రశీదుల గుట్టురట్టు చేసింది. ఆ భూములు ప్రభుత్వానివేనని.. పక్కా ఆధారాలతో సమర్థవంతంగా వాదనలు వినిపించింది. దాంతో సుప్రీంకోర్టులో కేసు గెలిచింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలోనే ట్రక్కు టెర్మినల్ నిర్మాణం కోసం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని వివిధ సర్వే నెంబర్లలో హెచ్‌ఎండీఏ దాదాపు 214.02 ఎకరాల భూమిని సేకరించింది. ఈ మేరకు అప్పట్లో అవార్డు నంబర్ 1/1990, ఫైల్ నంబర్ 84/86 ను కూడా జారీ చేసింది. వీటిలో పైగా ప్రాపర్టీస్‌కు చెందిన భూములు కూడా ఉన్నాయి. సర్వేనెంబర్ 725/21లో 7ఎకరాల 31 గుంటలు, సర్వేనెంబర్ 725/23లో 10 ఎకరాల 12 గుంటలు, సర్వేనెంబర్ 725/34 గుంటలతో పాటు మరిన్ని కొన్ని సర్వేనంబర్ల భూములు తమవే అంటూ ఇద్దరు వ్యక్తులు ఆ భూములను తమ పూర్వీకులు పైగా ప్రాపర్టీస్ నుంచి వేలంలో కొనుగోలు చేశారని హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. వాటిలోని అంశాలను నిజాం ఆస్తుల వివాద మూలాలకు సంబంధించినవిగా కోర్టు భావించింది. ఆ పిటీషన్లు సీఎస్ 7 బ్యాచ్ కేసులుగా పిలిచే పిటీషన్లతో జతచేసి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మసనం విచారణ చేపట్టింది. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయంస్థానం.. అవి హెచ్‌ఎండీఏ భూములని తీర్పు వెలువరించింది. హైకోర్టులో కేసు ఓడిపోయిన అక్రమార్కులు తిరిగి సుప్రీంకోర్టుకు వెళ్లారు. అక్కడ కూడా ఆ భూములు హెచ్‌ఎండీఏ భూములని తీర్పు వచ్చింది. రూ.కోట్ల విలువైన భూములను దక్కించుకోవాలని దురుద్దేశంతో తిరిగి కబ్జాకు యత్నించారు. అక్రమార్కులు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్జీఐఏ పోలీసులు హెచ్చరించారు.

రేపటి నుంచి స్వచ్ఛదనం-పచ్చదనం


మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'స్వచ్ఛదనం.. పచ్చదనం' కార్యక్రమాన్ని ఈ నెల 5వ తేదీ నుంచి 9 వరకు నిర్వహించనున్నామని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. రోజువారీగా చేపట్టే వివరాలు కలెక్టరేట్‌లో శనివారం ఆయన వెల్లడించారు. ఈ నెల 5వ తేదీన ప్రజాప్రతినిధులు, నాయకులు, స్వయం సహాయక సభ్యులు, యువజన సంఘాలు, గ్రామపంచాయతీ కమిటీలతో సమావేశం నిర్వహించి, ర్యాలీ చేపడుతారు. ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ బడుల పరిసరాలను శుభ్రం చేయాలి. వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. వ్యక్తిగత శుభ్రత, సీజనల్‌వ్యాధులు, ప్లాస్టిక్‌తో కలిగే నష్టాలు, పారిశుధ్యం, మొక్కల పెంపకంపై విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలను నిర్వహిస్తారు. 6న తాగునీటి వనరుల వద్ద పరిశుభ్రత, మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్, ఇంకుడు గుంతల నిర్మాణం, చెరువులు, కాలువల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడంపై వివరిస్తారు. 7న మురుగు కాల్వల్లో పూడిక తీయడం, నీరు నిలిచే ప్రాంతాల్లో మొర్రం పోయడం, ఖాళీ స్థలాల్లో మురుగును తొలగించడం కార్యక్రమాలను నిర్వహిస్తారు. 8న సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడం, విషజ్వరాలపై సర్వే, దోమల నివారణకు చర్యలు, వీధి కుక్కల సర్వే, పిచ్చి కుక్కల నివారణకు తీసుకోవాల్సిన చర్యల కార్యక్రమాలను నిర్వహిస్తారు. 9న అన్ని కుటుంబాలు డ్రైడేగా పాటించాలని, ఇంటి ఆవరణలో నీటిని తొలగించాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో శుభ్రం చేయాలని, వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటాలని కలెక్టర్ సూచించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

స్వచ్ఛదనం... పచ్చదనం కార్యక్రమ నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ గౌతమ్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లాలోని అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమ నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. అత్యవసరమైతే తప్ప.. అనుమతి లేకుండా సెలవు పెట్టినా.. నిర్వహణలో లోపాలున్నా చర్యలు తప్పవని పేర్కొన్నారు. పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులను సందర్శించి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలు, యువజన సంఘాలు, స్థానిక నాయకులు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు అందరినీ భాగస్వాములను చేయాలన్నారు.

స్వచ్ఛదనం, పచ్చదనంలో మొక్కలు నాటాలి


మాట్లాడుతున్న జిల్లా ట్రైనీకలెక్టర్ ఉమాహారతి

దౌల్తాబాద్, ఆగస్టు 3: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి తెలిపారు. శనివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో విజయలక్ష్మీ, వ్యవసాయ శాఖ అధికారిణి లావణ్య, ఎస్సై రవిగౌడ్ పాల్గొన్నారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం


మొక్క నాటుతున్న మల్కాజ్‌గిరి ఎంపీ రాజేందర్

కీసర రూరల్, ఆగస్టు 3 : పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం వనమహోత్సవంలో భాగంగా నాగారం మున్సిపాలిటీ 14వ వార్డు శివశంకర్ నగర్ కాలనీలో నాయకులు, మున్సిపల్ సిబ్బంది, సెరినిటీ పాఠశాల విద్యార్థులతో కలిసి శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేందర్‌కుమార్, కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, లావణ్య, లక్ష్మీ, డీఈఈ సుదర్శనం రఘు, మేనేజర్ చంద్రశేఖర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, బీజేపీ నాయకులు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి, వేణు, రవీందర్‌రెడ్డి, అక్కాల సురేష్, జూపల్లి నరేష్, రాకేష్ పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

- ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంషాబాద్‌రూరల్, ఆగస్టు3: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి ఎంఎస్ గార్డెన్‌లో జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహరెడ్డి అధ్యక్షతన బీజేపీ రంగారెడ్డి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుపొందాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు కాకముందే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, దానిని బీజేపీ ఆయుధంగా వాడుకోవాలని సూచించారు. బీజేపీ ప్రతి నాయకుడూ ప్రజల్లో ఉండి ప్రజాసమస్యలపై పోరాటం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు ఇవ్వలేదని, పార్లమెంట్‌లో తెలంగాణ పేరు వినిపించలేదని కొందరు నాయకులు విమర్శలు చేస్తున్నారని, వాటిని తిప్పి కొట్టాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాని సూచించారు. రానున్న రోజుల్లో రాష్ట్రానికి మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మహేశ్వరం ఎమ్మెల్యేగా పోటీ చేసిన అందే శ్రీరాములు యాదవ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేంరాజ్, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ జిల్లా ఉపాధ్యాక్షుడు నందకిశోర్, మున్సిపల్ అధ్యక్షులు దేవేందర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి సన్మానం

పార్లమెంట్‌లో మన రాష్ట్రం తరుపున బీజేపీ విప్‌గా నియమితులైన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క వేణుగోపాల్ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. రాష్ట్రం తరపున పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించడం చాలా సంతోషంగా ఉందని వేణుగోపాల్ అన్నారు. వీరితోపాటు పలువురు జిల్లా నాయులు ఎంపీని సన్మానించారు.

గంజాయిపై ఉక్కుపాదం

- విద్యార్థులకు ఇబ్బందులు కలిగించినా, ర్యాగింగ్ చేసినా కఠిన చర్యలు
- వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణ


చెన్‌గోముల్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణ

పూడూరు, ఆగస్టు 3 : గ్రామాల్లో గంజాయిపై ఉక్కుపాదం మోపాలని వికారాబాద్ జిల్లా ఎస్పీనారాయణ పోలీసులను ఆదేశించారు. శనివారం పూడూరు మండల పరిధిలోని చెన్‌గోముల్ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అక్కడున్న కేసుల వివరాలు, ఫైళ్లు, రికార్డులు, సిబ్బంది హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం ఎస్పీ అక్కడ పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడారు. గ్రామాల్లో విజిట్‌కు వెళ్లినప్పుడు అక్కడ క్షుణ్ణంగా పరిశీలించి అధిక మొత్తంలో సమాచారాన్ని రాబట్టాలని తెలిపారు. అదేవిధంగా సిబ్బంది ఒక గ్రామాన్ని సందర్శించినప్పుడు అక్కడ కొందరు వ్యక్తులతో పరిచయాలు పెంపొందించుకుని, అక్కడ జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై సమాచారం రాబట్టాలన్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. పూడూరు ప్రాంతం హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో ఇక్కడ భూముల ధరలు విపరీతంగా పెరగడంతో ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, అటువంటి కేసులు ఏమైనా వస్తే వాటిపైన జాగ్రత్త వహించాలని అన్నారు. గ్రామాల్లో, ఒకప్పుడు పట్టణాల్లో తెలియకుండా గంజాయి, డ్రగ్స్ సులువుగా అక్రమ రవాణా జరుగుతున్నాయన్నారు. అలాంటి గ్రామాల్లో వారిని గుర్తించాలని అన్నారు. అలాగే ఎక్స్‌పైరీ డేట్ లేని తినుబండారాలు వస్తున్నాయని, వాటిని సరఫరా చేసే వ్యక్తులను, తయారు చేసే కంపెనీలను గుర్తించి, వాటిని పూర్తిస్థాయిలో నిలిపివేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

హైదరాబాద్-మన్నెగూడ హైవే రోడ్డు విస్తరణ ప్రారంభదశలో ఉన్నందున, ఈ ప్రాంతం సింగిల్ రోడ్డు కావడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా యన్నారు. కావున ఈ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం చెన్‌గోముల్ వచ్చిన ఎస్పీని పరిగి డీఎస్పీ కరుణాసాగర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్, చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డిలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసులు నమోదు చేయాలి

వికారాబాద్, ఆగస్టు 3 : జిల్లాలో విద్యార్థులకు ఇబ్బందులు కలిగించినా, ర్యాగింగ్ చేసినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కె.నారాయణ రెడ్డి తెలిపారు. శనివారం జిల్లాలో పనిచేస్తున్న షీ టీం, భరోసా సెంటర్, కళాజాతా బృందం అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో షీ టీం, కళాజాతా బృందం, భరోసా కేంద్రం సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. ఎవరు కూడా ఆత్మహత్యలకు పాల్పడొద్దని సూచంచారు. జిల్లాలో ఎవరైనా ఆడ పిల్లల జోలికి వెళ్లినా, విద్యార్థులను ర్యాగింగ్ చేసినా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎ.వీరేందర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ క్రైం కో-ఆర్డినేషన్ సెంటర్ డీఎస్పీ ప్రశాంత్ రెడ్డి, షీటీం, భరోసా కళాజాతా బృందం అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం కూల్చివేత


ఎక్స్‌కవేటర్లతో రైసుమిల్లు షెడ్డును కూల్చివేస్తున్న దృశ్యం

బొంరాస్‌పేట్, ఆగస్టు 3: ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న రైసుమిల్లు షెడ్డును అధికారులు శనివారం కూల్చివేశారు. దుద్యాల గ్రామ పరిధిలో రాఘవేంద్ర రైసుమిల్లును అధికారులు ఎక్స్‌కవేటర్ల సహాయంతో తొలగించారు. దుద్యాల పరిధిలోని మహబూబ్‌నగర్-చించోలి హైవే రోడ్డు పక్కన దుద్యాల గేటు సమీపంలో (సర్వే నెం.1090లో ప్రభుత్వ భూమి, సర్వే నెం.1089లో ప్రైవేట్ భూమి) రాఘవేంద్ర రైసుమిల్లును నిర్మించారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు రైసుమిల్లు షెడ్డు సగభాగం ప్రభుత్వ భూమిలో ఉందంటూ నెల రోజుల క్రితం సంబంధిత రైసుమిల్లు యజమానికి నోటీసులు అందించారు. శనివారం తహసీల్దార్ దానయ్య, డీపీవో జయసుధ, డీఎల్‌పీవో శంకర్‌నాయక్, ఎంపీవో మహేశ్‌బాబు, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ల సహాయంతో ప్రభుత్వ భూమిలో రేకుల షెడ్డును కూల్చివేశారు. ఈ సందర్భంగా బొంరాస్‌పేట్ ఎస్సై అబ్దుల్‌రవూఫ్, దౌల్తాబాద్ ఎస్సై రవిగౌడ్‌తో పాటు 20 మంది పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ రైసుమిల్లు మహబూబ్‌నగర్ జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కుటుంబ సభ్యులకు సంబంధించినదిగా సమాచారం.

నాగారం వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ సస్పెన్షన్

ధారూరు, ఆగస్టు 3: వైద్యం అందక మృతి చెందిన మేకను పశువైద్యశాల బోర్డుకు వేలాడదీసిన సంఘటనలో మండల పరిధిలోని నాగారం పశువైద్యశాల వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ (వీఎల్‌వో) సురేందర్ నాయక్ సస్పెండ్ అయ్యారు. నాగారంలో గత నెల 31న రైతు దశరథం మేకను వైద్యం కోసం పశువైద్యశాలకు తీసుకువచ్చాడు. పశువైద్యశాలలో సిబ్బంది లేక వైద్యం అందక మేక మృతి చెందింది. దీంతో ఆగ్రహించిన రైతు మేక కళేబరాన్ని పశువైద్యశాల బోర్డుకు వేలాడదీసి, నిరసన తెలిపాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పశుసంవర్థక శాఖ ఉన్నతాధికారులు ఈ సంఘటనపై విచారణ జరిపారు. వీఎల్‌వో సురేందర్‌నాయక్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ఆదిభట్ల, ఆగస్టు 3: అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫైర్‌స్టేషన్ ఇబ్రహీంపట్నం డివిజన్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలు - నివారణ చర్యలపై నాగేశ్వర్ రావు, లీడింగ్ ఫైర్‌మెన్ ఖదీర్ సిబ్బందితో కలిసి శనివారం ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లో ఓ ప్రైవేట్ హైస్కూలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రావు మాట్లాడుతూ అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రమాదం జరిగితే ఆందోళన చెందకుండా వెంటనే డైల్ 101కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ చైర్మన్ లక్క రాజు శ్రీనివాసరావు, డైరక్టర్ లక్క రాజు రాధిక ఉపాధ్యాయులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు సహాయం అందించాలి

చేవెళ్ల, ఆగస్టు 3: కేరళ వరద బాధితులకు సహాయం అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే.రామస్వామి తెలిపారు. కేరళ రాష్ట్రంలోని వయనాడు వరద బాధితుల కోసం శనివారం చేవెళ్లలో సీపీఐ ఆధ్వర్యంలో విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేరళ రాష్ట్రంలోని వయనాడు ప్రాంతంలో ప్రకృతి విపత్తు జరిగిందన్నారు. అక్కడ ప్రజలు కష్టల్లో ఉన్నారని, వారికి సహాయం చేయాలని కోరారు. చేవెళ్ల మండల కార్యదర్శి సత్తిరెడ్డి, నక్క జంగయ్య, సుధీర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వడ్ల మంజుల, నాయకులు కృష్ణగౌడ్, సాయిలు, నర్సింలు తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలల నిరసన

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ శనివారం ఇబ్రహీంపట్నంలో మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. సుప్రీంకోర్టు ఈనెల ఒకటిన ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తున్నామని నాయకులు అన్నారు. మాలల సర్వతోముఖాభివృద్ధికోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని, ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమని అన్నారు. ఈ నెల 6 7, 8 తేదీల్లో ఢిల్లీలో జరిగే సామాజిక చైతన్య దీక్షలకు పెద్దఎత్తున తరలి వెళ్లనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మున్సిపల్ కౌన్సిలర్ భర్త జగన్, ఈగల రాములు, హనుమండ్ల కృష్ణ, అంగద్ కుమార్, బండి మహేష్, మాదరి శివకుమార్, నర్సింగ్‌రావు, చిక్కుడు గుండాలు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


సీహెచ్‌సీ భవనం చుట్టూ చెట్లతోపాటు ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

అపరిశుభ్రంగా సీహెచ్‌సీ భవనం

బషీరాబాద్, ఆగస్టు 3: బషీరాబాద్‌లోని సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) భవనం చుట్టూ పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఆస్పత్రి పరిసరాలు ఆహ్లాదంగా ఉండాల్సి ఉండగా ఆ పరిస్థితి ఇక్కడ కనిపించడంలేదు. ఈ భవనం పక్కన, చుట్టూ గుబురుగా పెరిగిన పిచ్చిమొక్కలు చిట్టడివిని తలపిస్తోంది. ఏపుగా పెరిగిన ముళ్లకంపల కొమ్మలు ఆస్పత్రి భవనం కిటికీలోంచి లోపలికి వస్తున్నాయి. పిచ్చి మొక్కలతో పాటు హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. ఈ భవనం వెనకాల శిథిలావస్థలో నిజాం కాలంనాటి భవనం ఉంది. ఈ భవనంలో పాములు తిష్ఠవేసి తరుచూ సీహెచ్‌సీ పరిసరాల్లో సంచరిస్తున్నాయని ఇక్కడి వైద్య సిబ్బంది చెబుతున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



కడ్తాల : మాట్లాడుతున్న డీటీడీవో రామేశ్వరి

● స్వచ్ఛదనం-పచ్చదనంపై సమీక్ష సమావేశాల్లో అధికారులు



ఆమనగల్లు : మాట్లాడుతున్న కమిషనర్ వసంత



షాద్‌నగర్ రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రతేకాధికారి రామారావు

కడ్తాల్, ఆగస్టు 3: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కడ్తాల మండలంలో 1.44 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించి, ఇప్పటి వరకు 60వేల మొక్కలు నాటినట్లు డీటీడీవో, మండల ప్రత్యేక అధికారి రామేశ్వరిదేవి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో సుజాత అధ్యక్షతన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు. ఈ నెల 5నుంచి 9వరకు నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రామేశ్వరి దేవి సూచించారు. మహిళా సంఘాల సభ్యుల భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతమయ్యేలా చూడాలన్నారు. ఎంపీవో విజయ్‌కుమార్ పాల్, డాక్టర్ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై ఎంపీడీవో కుసుమ మాధురి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈనెల 5 నుంచి 9వరకు చేపట్టే కార్యక్రమాల గూర్చి పంచాయతీ ప్రత్యేక అధికారులకు, మండల అధికారులకు వివరించారు. ఎంఈవో సర్దార్‌నాయక్, ఏపీవో మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వసంత అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని వార్డులో మొక్కలు నాటి, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఛైర్మన్ రాంపాల్ నాయక్, వైస్‌ఛైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు, డాక్టర్ మంజుల దేవి, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చేవెళ్ల : మానవ మనుగడకు మూలాధారమైన అడవులను కాపాడంతోపాటు వన్యప్రాణులకు సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలో సత్యసాయి గ్రామర్ స్కూల్ విద్యార్థులు వనమహోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలంటే పచ్చని చెట్లు పెంచాలన్నారు. పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులు గుర్తుగా ఒక మొక్కను నాటాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నాయుడు, ఏవో శివరామ్, మహేందర్‌రెడ్డి, పీఈటీ మల్లేశ్, రాము, నవీన్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ రూరల్ : వన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి రామారావు తెలిపారు. ఈనెల 5నుంచి 9వరకు నిర్వహించే వన మహోత్సవంపై మండల పరిషత్ సమావేశం హాలులో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొదటి రోజు ర్యాలీలు నిర్వహించి వీధులను శుభ్రం చేయడంతో పాటు ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే నష్టం గూర్చి వివరించాలని చెప్పారు. అయిదు రోజుల పాటు ప్రభుత్వం సూచించిన విధంగా లక్ష్యాన్ని చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో బన్సీలాల్, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యాచారం : ప్రతీ గ్రామంలో విరివిగా మొక్కలు నాటడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతీ ఒక్కరు చొరవ తీసుకోవాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఐకేసీ, పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లతో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో ఎంపీ డీవో పాల్గొని మాట్లాడారు. ఖాళీ స్థలాలు, రోడ్లవెంట మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ బాధ్యతలను వార్డులకు చెందిన ప్రముఖులకు అప్పగించాలన్నారు. డయేరియా, అతిసార వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ నాయకుడి మృతి

● ఆటోను ఢీకొన్న కారు.. డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం

● హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఘటన



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో



రమేష్ నాయక్(ఫైల్

ఆమనగల్లు, ఆగస్టు 3 : ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పెంటతండా గేటు వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాణావత్ రమేష్‌నాయక్(40) దుర్మరణం చెందాడు. పోలీసుల కథనంమేరకు.. ఆమనగల్లు మండలంలోని పులిగోనిపల్లి తండాకు చెందిన రమేష్‌నాయక్ ఆమనగల్లు నుంచి ఆటో నడుపుకుంటూ హైదరాబాద్ వైపు వెళుతున్నాడు. పెంటతండా గేటు వద్ద ఎదురుగా వస్తున్న కారు అతివేగంతో వచ్చి ఆటోను ఢీకొట్టింది. దాంతో ఆటో నడుపుతున్న రమేష్‌నాయక్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. ప్రమాదంలో ఆటో నుజునుజ్జయింది. మృతుడు రమేష్ నాయక్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని కల్వకుర్తి ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ఏఎస్సై యాదయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో ట్రాన్స్‌కో హెల్పర్ దుర్మరణం

కొత్తూర్, ఆగస్టు 3: విద్యుదాఘాతానికి గురై ట్రాన్స్‌కో హెల్పర్ బాలుచారి(35) దుర్మరణం చెందిన ఘటన కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిద్దాపూర్ శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు, ట్రాన్స్‌కో అధికారుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని కొడిచర్ల గ్రామానికి చెందిన బాలుచారి పెంజర్ల గ్రామంలో హెల్పర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల కేశంపేట మండలానికి బదిలీ అయ్యారు. సిద్దాపూర్ నుంచి కేశంపేట మండలంలోని బైర్‌ఖాన్‌పల్లి గ్రామానికి వెళ్లే 11కేవీ విద్యుత్‌లైన్ జంపర్ కట్ కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాంతో రైతులు బాలుచారికి సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్నాడు. విద్యుత్ స్తంభం ఎక్కి జంపర్‌ను సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. గతంలో ఈ ప్రాంతంలో విధులు నిర్వహించిన అనుభవం బాలుకు ఉండడంతో ఈ ప్రాంత రైతులు బాలుచారి సేవలు వినియోగించుకుంటున్నారు. ఇందులో భాగంగానే బాలుచారికి రైతులు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ట్రాన్స్‌కో డిపార్టుమెంట్‌తో పాటు రైతుల వద్ద బాలుచారికి మంచిపేరు ఉంది. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడు బాలుచారికి భార్య, కుమార్తె ఉంది. తమ సబ్‌స్టేషన్ నుంచి ఎలాంటి ఎల్‌సీ తీసుకోలేదని ట్రాన్స్‌కో ఏఈ సాయికృష్ణ తెలిపారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు.

ఈసీ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయండి



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

మొయినాబాద్, ఆగస్టు 3: మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ-శంషాబాద్ మండలం కవ్వగూడ గ్రామాల మధ్య ఉన్న ఈసీ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని నాగిరెడ్డిగూడ గ్రామస్థులు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కోరారు. శనివారం గ్రామస్థులు నగరంలోని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నివాసంలో ఆయన్ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. వర్షకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురైతున్నాయని.. శంషాబాద్ మండల కేంద్రానికి వెళ్లాలంటే 15 కిలో మీటర్లు ఎక్కువ దూరం ప్రయాణించి వెళ్లాల్సి వస్తుందని ఎంపీ వివరించారు. నాగిరెడ్డిగూడ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. త్వరలో ఈసీ వాగును పరిశీలిస్తానని, గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని కొండా హామీ ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రత్నం, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్, అశోక్ యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం



షాద్‌నగర్ రూరల్ : ఫరూఖ్‌నగర్‌లో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ వెంకటమ్మ



కడ్తాల్ : మైసిగండిలో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న సూపర్ వైజర్ శబరి

కడ్తాల్/షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 3: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠ మైనవని, రోగనిరోధక శక్తి పెంపునకు, సంపూర్ణ ఆరోగ్యం, బిడ్డ ఎదుగుదలకు దోహదపడుతాయని ఐసీడీఎస్ సూపర్ వైజర్ శబరి అన్నారు. మైసిగండిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. శబరి ముఖ్యఅతిథిగా హాజరై తల్లులు, చిన్నారులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. బిడ్డపుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని, ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉండి.. బిడ్డ ఎదుగుదలకు దోహదపడుతాయని తెలిపారు. టీచర్ మీన, ఆశా కార్యకర్తలు సరోజిని, రజిత, తల్లులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే తల్లి పాలు పిల్లలకు శ్రేష్ఠమైనవని, రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సంధ్యారాణి తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం చింతగూడ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లి పాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని వివరించారు. అలాగే ఫరూఖ్‌నగర్‌లోని సెంటర్-1లో తల్లిపాల వారోత్సవాలు జరుపుకున్నారు. తల్లిపాల ఆవశ్యకతను మహిళలకు వివరించారు. సూపర్‌వైజర్ వెంకటమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్ణ, జయసుధ, నాగజ్యోతి, విరాబాయి, మహిళలు పాల్గొన్నారు.

అర్హులందరూ రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

కడ్తాల్/మాడ్గుల, ఆగస్టు 3 : రైతుబీమా కొరకు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కడ్తాల్, మాడ్గుల వ్యవసాయ శాఖ అధికారులు శ్రీలత, గౌతమ్‌లు కోరారు. ఈనెల 5 నుంచి వరకు చివరి గడువు అని ఆమె పేర్కొన్నారు. శనివారం వారు ఓ ప్రకటనలో పలు విషయాలు వెల్లడించారు. రైతుబీమా దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ నామినీ ఆధార్ కార్డ్ జిరాక్స్ జత చేసి స్థానిక క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారులకు దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా వారు రైతులకు సూచించారు.

ముదిరాజ్ ధనికులకు ఓ న్యాయం.. నిరుపేదలకు ఓ న్యాయమా?

● ప్రభుత్వం మారినా.. అధికారుల తీరు మారదా?



దేవేందర్ ముదిరాజ్

కొత్తూర్, ఆగస్టు 3: స్థానిక మున్సిపాలిటీ అధికారులు ధనికులకు ఓ న్యాయం.. నిరుపేదలకు ఓ న్యాయం చేస్తున్నారని షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీరమోని దేవేందర్‌ముదిరాజ్ ఆరోపించారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో కొత్తూర్ గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు పలువురు స్తోమత లేని నిరుపేదలు 100, 50 గజాల్లో జీపీ అనుమతులతో ఇళ్లు నిర్మించుకున్నారని, పలువురు మొదటి అంతస్తు వేసుకునేందుకు మున్సిపాలిటీలో అనుమతి పెట్టుకోగా.. అధికారులు అనుమతులివ్వకుండా ఉన్న ఇళ్లను కూల్చివేసి సెట్‌బ్యాక్ అయ్యి నిర్మించుకోవాలని ఉచిత సలహాలు ఇస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని అసైన్డ్ భూముల్లో అనుమతులు లేకుండా 4, 5అంతస్తులు ఇళ్లు నిర్మిస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు ధనికులకు కొమ్ము కాస్తూ, నిరుపేదలను విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. కొత్తూర్ పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఆయా రాష్ట్రాల కార్మికులు ఉపాధి పొందుతూ చిన్నపాటి ఇళ్లను నిర్మించుకుని జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీలో ప్రజా సమస్యలు పరిష్కారించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని దుయ్యబట్టారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకపోయినా ఫలితం లేకపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అధికారులు మాత్రం నిద్రమత్తులోనే మునిగి తేలుతున్నారని, స్పందించకపోతే రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోతానని దేవేందర్ పేర్కొన్నారు.

ఘనంగా కాటమయ్య బోనాలు



వేడుకలో పాల్గొన్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఆదిభట్ల, ఆగస్టు 3 : ఆషాఢ మాసం బోనాల్లో భాగంగా గౌడ కులస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే కాటమయ్య బోనాలు ఆదిభట్లలో శనివారం ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె సాంబయ్యగౌడ్ ఆధ్వర్యంలో వారి ఆరాధ్య దైవం కంఠమలింగేశ్వర స్వామికి బోనాలు సమర్పించారు. ఆషాఢమాసం బోనాల కార్యక్రమంలో భాగంగా మొదట శనివారం కాటమయ్యకు తరువాత రోజు నేడు(ఆదివారం) ఊరపోచమ్మకు బోనాలు సమర్పిస్తారు. ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, పల్లె సాయిబాబగౌడ్, రజినీకాంత్ గౌడ్, గుడిదేవుని రఘువీర్ గౌడ, శ్రవన్‌గౌడ్, కౌన్సిలర్ లావణ్య పాండు రంగారెడ్డి, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్‌పర్సన్ కోరే కళమ్మ జంగయ్య, గౌడ సంఘం, వివిధ రాజకీయ పార్టీల నాయకులు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సర్వేయర్‌ను అందుబాటులో ఉంచాలి

కేశంపేట, ఆగస్టు 3: మండలంలో సర్వేయర్ పోస్ట్ ఉన్నట్లా? లేనట్లా? అని కేశంపేట మండల బీజేపీ నాయకులు కర్రెడ్ల నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. ఈమేరకు శనివారం కేశంపేట తహసీల్దార్ మీర్ అజాంఅలీకి వినతిపత్రం అందించారు. మండలంలో విధులు నిర్వహించే సర్వేయర్ విధులకు హాజురుకావడం లేదని, ప్రభుత్వ పథకాలతో పాటు రైతులకు నక్షబాట సమస్యలు అధికమయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వేయర్ అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో చౌడం శ్రీనివాస్, మహేష్, పారేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు పెద్దపీట: ఎమ్మెల్యే కసిరెడ్డి



వినతిపత్రం ఇస్తున్న ఏబీసీ క్లబ్ సభ్యులు

ఆమనగల్లు, ఆగస్టు 3: రాష్ట్ర ప్రభుత్వం విద్య, క్రీడల అభివృద్ధికి పెద్ద పీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. క్రీడలకు ప్రాధాన్యం పెంచడానికి వీలుగా ఈ ఏడాది బడ్జెట్‌లో అత్యధికంగా రూ.361 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మించాలని ఎమ్మెల్యే కసిరెడ్డిని ఆమనగల్లు బ్యాండ్మింటన్ సభ్యులు కోరారు. శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆమనగల్లు బ్యాండ్మింటన్ క్లబ్ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్, కార్యదర్శి కొత్ర మల్లేశ్, సభ్యులు ఆనంద్ కుమార్‌లు కసిరెడ్డిని కలిసి వినతిపత్రమిచ్చారు. ప్రతీ మండల కేంద్రంలో మినీస్టేడియాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తుందని నారాయణరెడ్డి పేర్కొన్నారు.

అక్రమంగా నడుపుతున్న క్యాబ్‌లు సీజ్

● శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నడుపుతుండగా పోలీసులకు పట్టించిన స్థానిక క్యాబ్ డ్రైవర్లు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 3 : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నడుపుతున్న ఇతర రాష్ట్రాలకు చెందిన క్యాబ్‌లను శనివారం స్థానిక క్యాబ్ డ్రైవర్లు పోలీసులకు పట్టించారు. ఆర్జీఐఏ సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక, ఏపీ, గుజరాత్‌కు చెందిన పలువురు క్యాబ్ డ్రైవర్లు శనివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రాకపోకలు సాగించారు. గమనించిన స్థానిక డ్రైవర్లు ఏడు క్యాబ్‌లను పోలీసులకు అప్పగించారు. దాంతో కేసు నమోదు చేసి సీజ్ చేశారు. శుక్రవారం ఆర్జీఐఏ పోలీసులు స్థానిక క్యాబ్ డ్రైవర్లతో సమావేశం నిర్వహించిన మరుసటిరోజే క్యాబ్‌లు పట్టుబడడంపై స్థానిక డ్రైవర్లు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కొందరు ఓన్‌ప్లేట్ కార్లకు ట్యాక్సీ ప్లేట్లు బిగించుకొని ఎయిర్‌పోర్టులో తిరుగుతున్నారని, పోలీసులు తగిన చర్యలు తీసుకోకుంటే ఎయిర్‌పోర్టులో క్యాబ్‌లను పూర్తిగా స్తంభింపజేస్తామని హెచ్చరించారు. అయితే, పోలీసులు మాత్రం అక్రమంగా తిరుగుతున్న క్యాబ్ డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలయాల పునఃప్రతిష్ట వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం

కొత్తూర్, ఆగస్టు 3: మున్సిపాలిటీలోని గ్రామ దేవతల ఆలయాలు, విగ్రహాల పునఃప్రతిష్ట కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామని నాయకులు బి.దేవేందర్‌యాదవ్, జె.వేణుగోపాల్‌గౌడ్‌లు అన్నారు. పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ అమ్మవార్లకు సంబంధించి మున్సిపాలిటీలో 8 దేవాలయాలను కొంత కాలంగా దాతల సహకారంతో నిర్మాణాలు జరుగుతున్నాయి. నిర్మాణాలు తుదిదశకు చేరుకున్నాయి. ఈనెల 16 నుంచి 23వరకు ఆలయాల ప్రారంభం, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్టలు ఉంటాయని పేర్కొన్నారు. ఈమేరకు మహోత్సవానికి సంబంధించి పోస్టర్‌ను శనివారం నాయకులు ఆవిష్కరించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు నర్సింహగౌడ్, సోమ్లనాయక్, తదితరులు పాల్గొన్నారు.



గ్రామ దేవతల ఆలయాల వేడుకల పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

అంగన్‌వాడీ టీచర్ల సేవలు వెలకట్టలేనివి



టీచర్లను సన్మానిస్తున్న సీడీపీవో శోభారాణి

షాబాద్, ఆగస్టు 3 : అంగన్‌వాడీ టీచర్ల సేవలు వెలకట్టలేనివని ఐసీడీఎస్ చేవెళ్ల సీడీపీవో శోభారాణి అన్నారు. అంగన్‌వాడీ టీచర్లుగా రిటైర్మెంట్ పొందిన మండలానికి చెందిన శకుంతల (ఎర్రోనిగూడ), సరస్వతి(కేశవగూడ) అంగన్‌వాడీ టీచర్లతో పాటు చేవెళ్ల క్లస్టర్‌లో రిటైర్మెంట్ పొందిన వారిని శనివారం శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. 35 సవంత్సరాలుగా టీచర్లుగా విధులు నిర్వహించి, వైద్య, విద్య తదితర అంశాల్లో సలహాలు, సూచనలు ఇచ్చి గ్రామస్థుల నుంచి మంచిపేరు తెచ్చుకున్న అంగన్‌వాడీ టీచర్ల సేవలు ఎల్లకాలం గుర్తుంటాయన్నారు. సూపర్‌వైజర్ రమాదేవి, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

చేవెళ్ల, ఆగస్టు 3 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేలా ప్రతి గ్రామంలో పార్టీ అభ్యర్థులు పోటీ చేసి గెలిచేలా పని చేద్దామని చేవెళ్ల నియోజకవర్గం యువ నాయకుడు మల్లారి వైభవ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు ముందుకు సాగాలన్నారు. అన్ని చోట్ల బీజేపీ గ్రామ స్థాయి నుంచే సత్తాచాటితే బలం మరింతగా పెరుగుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు నాయకులు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీని కాపాడుకొని పనిచేసే వారికి భవిష్యత్తు ఉంటుందన్నారు. రాబోయే 2028 సంవత్సరంలో జరిగే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. బూత్ స్థాయి కార్యకర్తలకు మంచి అవకాశాలు వస్తాయన్నారు. కాంగ్రెస్ మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని ప్రజలకు అర్థమైపోయిందన్నారు.

నైటింగేల్ నర్సింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

మొయినాబాద్, ఆగస్టు 3: మూడేళ్ల పాటు నర్సింగ్ కోర్సు అందిస్తామని, అందుకు సంబంధించి ప్రాక్టీస్‌తో పాటు సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పి కళాశాలలో చేర్పించుకుని మోసం చేస్తున్న నైటింగేల్ నర్సింగ్ కళాశాలపై, భాస్కర ఆసుపత్రి హెడ్ నర్సు వసంతంపై చర్యలు తీసుకోవాలని జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కస్తూర్బా గాంధీ ఇంటర్ కళాశాలల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. అమ్డాపూర్ చౌరస్తాలోని భాస్కర మెడికల్ కళాశాల ఎదుట శనివారం సాయంత్రం ఆందోళనకు దిగారు. భాస్కర మెడికల్ కళాశాలలో హెడ్ నర్సుగా పనిచేస్తున్న వసంత నగరంలోని నైటింగేల్ నర్సింగ్ కళాశాలలో అడ్మిన్ అయితే జనరల్ నర్స్ మిడ్‌వైఫరీ(జీఎన్ఎం) కోర్సు త్వరగతిన పూర్తి చేసుకోగలుతారని చెప్పి సర్టిఫికెట్లు(టెన్త్, ఇంటర్) తీసుకున్నారని తెలిపారు. 2021లో అడ్మిన్ చేయించి సంవత్సరానికి రూ.15 వేల ఫీజు కూడా వసూలు చేసింది. భాస్కర ఆసుపత్రిలో ప్రాక్టీస్ చేస్తే నెలకు రూ.3వేల చొప్పున మూడేళ్లు చేయాలని చెప్పిందని విద్యార్థులు తెలిపారు. ఇప్పటి వరకు ఎలాంటి పరీక్షలు నిర్వహించలేదని, ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేదని చెప్పారు. నైటింగేల్ నర్సింగ్ కళాశాల యాజమాన్యం, వసంతలపై కేసు నమోదు చేయాలని, మా సర్టిఫికెట్లు మాకు ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి



డీఎంతో కలిసి సర్వీసును ప్రారంభిస్తున్న మాజీ ఉపసర్పంచ్ రేవంత్‌రెడ్డి

కందుకూరు, ఆగస్టు 3: టీఎస్‌ఆర్టీసీ సేవలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అగర్‌మియాగూడ మాజీ ఉపసర్పంచ్ వడ్డెపల్లి రేవంత్‌రెడ్డి కోరారు. శనివారం ఇబ్రహీంపట్నం నుంచి తిమ్మాపురం గ్రామం మీదుగా అగర్‌మియాగూడ గ్రామానికి నూతనంగా ఏర్పాటు చేసిన బస్సు సర్వీసును డిపో మేనేజర్ వెంకటనర్సయ్యతో కలిసి ప్రారంభించారు. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామానికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించడంతో డిపో మేనేజర్ వెంకటనర్సయ్యను అభినందించారు. ఇబ్రహీంపట్నం డిపో అసిస్టెంట్ మేనేజర్ రాజేష్, నాయకులు లిక్కి జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, సీహెచ్ రవీందర్, పాండు, గణేష్, పెద్దిరాజు, దశరథ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ పేరుతో ప్రభుత్వం మోసం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 3: జాబ్ క్యాలెండర్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం యువతను మోసం చేస్తోందని బీఆర్ఎస్ విద్యార్థి సంఘం ఆరోపించింది. శనివారం ఇబ్రహీంపట్నంలో సీఎం, రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మలు దహనం చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, శివసాయి, చిన్న, ప్రవీణ్‌కుమార్, గణేష్‌గౌడ్, మహేష్, సురేష్ తదితరులున్నారు.

నిరుద్యోగుల కల సాకారం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 3: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విడుదల జాబ్ క్యాలెండర్ నిరుద్యోగుల కల సాకారం చేసేదిగా ఉందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నంలో సీఎం చిత్రప టానికి పాలాభిషేకం చేశారు. నందకిషోర్, అనాస్, తేజ, సాయి, గణేష్, రమేష్ తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : వానాకాలం పంటల సాగుకు అవసరమైన డీఏపీ, యూరియా అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అరుణకుమారి అన్నారు. పట్టణంలోని ఎరువుల దుకాణాలను శనివారం ఏవో తనిఖీ చేశారు. రికార్డులు, ఎరువుల నిల్వలను పరిశీలించారు.

ఆమనగల్లు : లోక్ సభ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీ సభ్యుడిగా నియమితులైన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవిని శనివారం ఆమనగల్లు మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్ గౌడ్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సత్కరించి అభినందించారు.

కందుకూరు : ఎస్సీ వర్గీకరనకు గత 30 సంవత్సరాలుగా చేపట్టిన పోరాట ఫలితంగానే సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యులతో ధర్మాసనం వేసినట్లు ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కందపెద్ద నర్సింహ్మ అన్నారు. శనివారం నగరంలోని విద్యానగర్‌లో జరిగిన విజయోత్సవ సభలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనును సన్మానించారు. ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంద రాజు, తదితరులు పాల్గొన్నారు.

యాచారం : మీ ఇంట్లో అమ్మనాన్నల ఫోన్‌లకు గుర్తుతెలియని కాల్స్ వస్తే ఎత్తరాదని, ఆధార్ కార్డు నెంబర్ అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పరాదని, మీ తల్లిదండ్రులకు సూచించాలని సీఐ శంకర్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని గురుకుల విద్యాపీఠ్‌లో సైబర్‌క్రైంపై అవగాహన కల్పించారు.

షాబాద్ : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రవీందర్‌రెడ్డి ఎల్గొండగూడ ప్రైమరీ స్కూల్‌కు బీరువా, మైక్‌సెట్, టేబుళ్లు ఉచితంగా అందజేశారు. హెచ్ఎం మల్లేష్‌గౌడ్, విద్యార్థులున్నారు.

షాబాద్ : పోలారం మాజీ సర్పంచ్ మంగమ్మ, ఉపసర్పంచ్ శివకుమార్ గౌడ్, వార్డు సభ్యులను గ్రామస్థులు సన్మానించారు. కార్యదర్శి కరుణాకర్ బదిలీపై వెళ్లడంతో సన్మానించారు.

కడ్తాల్ : మండల కేంద్రంలోని మాదిగల శ్మశాన వాటికలో దింపుడు కళ్లెంను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని మాదిగ కులస్థులు డిప్యూటీ తహసీల్దార్‌కు మాజీ వైస్ఎంపీపీ ఆనంద్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కూల్చివేత నిందితులను గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

కేశంపేట : మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాధికారి శిరీష తెలిపారు. కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లి, కాకునూర్, వేముల్‌నర్వ, ఇప్పలపల్లి, కేశంపేటలో మొక్కజొన్న పైరును పరిశీలించారు.